
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
25-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

అకాల వర్షం.. రైతన్నకు నష్టం.. 2





2 డివైడర్‌ను ఢీకొని కంటెయినర్ బోల్తా

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



**అక్షరటుడే, బీర్కూర్:** నాగుల చవితి సందర్భంగా మండల కేంద్రంలోని జోడు లింగాలయం వద్ద భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం మహిళలతో కిక్కిరిసిపోయింది. మహిళలు పుట్టలో పాలు పోసి నాగదేవతకు పూజలు చేశారు.



## కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కావాల్సిన స్థలాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్ అండ్‌బీ ఈఈ మోహన్ ఇతర అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి.. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. విగ్రహ ఏర్పాటు కోసం రూ.5.80 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు.



## ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన పౌష్టికాహారం గురించి ప్రతి ఇంట్లో అవగాహన కల్పించడమే పోషణమాసం ఉద్దేశమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఒక కుటుంబం ఆరోగ్యంగా ముందుకు సాగాలంటే మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం ప్రాముఖ్యత చాలా ఉందని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజ్, సీడీపీవో సౌభాగ్య, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్ మండలాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల కోసం రోడ్డెక్కిన రైతులు

**అక్షరటుడే, బాన్సువాడ:** కొనుగోలు కేంద్రాల కోసం రైతులు రోడ్డెక్కారు. నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్ పల్లి చౌరస్తా వద్ద శనివారం రైతులు రాస్తారోకో చేపట్టారు. ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి పండించిన పంటను అమ్మడానికి కూడా మిల్లర్లు సహకరించడం లేదన్నారు. ధాన్యం తడిగా ఉందని, తక్కువ ధరలు చెబుతూ కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు.

"నా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో బీఆర్ఎస్, కేసీఆర్ కోసమే పనిచేశాను. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఓపికతో ముందుకు సాగాను. కానీ చివరకు నన్ను ఓడించేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్ర పన్నడం ఎంతో కలిచివేసింది. నిజామాబాద్‌లో నా ఓటమికి బీఆర్ఎస్సే కారణం. పార్టీ నుంచి విడిపోయిన తర్వాత ప్రజల కోసం సొంత దారిలో నడుస్తున్నాను. ఈ జిల్లా కోడలినైన నన్ను ఆశీర్వదించండి.

– తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

- అక్షరటుడే, ఇందూరు

# నా ఓటమికి కారణం బీఆర్ఎస్



■ జిల్లా ప్రజలు తొలి ఆశీర్వాదం ఇవ్వాలి ■ ఉద్యమకారుల కోసం పోరాడుతా ■ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

నిజామాబాద్‌లో నా ఓటమికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని.. ఈ విషయం నాయకులందరికీ తెలుసని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. 'జనంబాట'లో భాగంగా జిల్లా కేంద్రంలోని జాగృతి కార్యాలయం వద్ద శనివారం ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో బీఆర్ఎస్, కేసీఆర్ కోసం పనిచేశానన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఓపికతో ముందుకు సాగానని గుర్తు చేశారు. కానీ చివరికి తనను ఓడించేందుకు బీఆర్ఎస్ నాయకులే కుట్ర పన్నడం ఎంతో కలిచివేసిందని వ్యాఖ్యానించారు. పార్టీ నుంచి విడిపోయిన తర్వాత ప్రజల కోసం సొంత దారిలో నడుస్తున్నానన్నారు.

### తొలి ఆశీర్వాదం జిల్లా నుంచే కావాలి..

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మేధావులు, విద్యావేత్తలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలతో భేటీ అవుతానని ప్రజా సమస్యలపై ఉద్యమం కొనసాగిస్తానని కవిత తెలిపారు. తాను నిజామాబాద్ జిల్లా కోడలినని, తొలి ఆశీర్వాదం జిల్లా ప్రజలు ఇవ్వాలనే ఉద్దేశంతో జనంబాట ఇక్కడి నుంచే ప్రారంభించానని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు అందరినీ



ఆదరించిన జిల్లా నిజామాబాద్ అని కొనియాడారు.

### రెండేళ్లయినా ఏమీ చేయలేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఏమి చేయలేకపోయిందని కవిత విమర్శించారు. మహిళలకు పెన్షన్ పెంపు, నిరుద్యోగులపై వివక్ష కొనసాగుతోందన్నారు. గత పదేళ్లలో కొంతవరకు సాధించినా.. ఇంకా సాధించాల్సింది ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితి లేదని.. ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. పీసీసీ అధ్యక్షుడు జిల్లా వాసి అయినప్పటికీ నిజామాబాద్‌కు ఏమీ చేయలేకపోవడం దురదృష్టకరమన్నారు. విద్య, ఉద్యోగం, వైద్యాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం మాత్రమే కాంగ్రెస్ పని చేస్తుందే తప్ప.. వారి కోసం ఏమీ చేయడం లేదని వ్యాఖ్యానించారు.

### అమరవీరులకు న్యాయం జరగలేదు..

అమరవీరుల కుటుంబాలకు న్యాయం దక్కడం లేదని కవిత అన్నారు. వారికి రూ. కోటి ఇచ్చేవరకు తాను ఉద్యమిస్తానని వెల్లడించారు. అలాగే ఉద్యమకారులకు ఐడెంటిటీ కార్డు ఇవ్వాలని స్వాతంత్ర్య సమరయోధుల మాదిరిగా పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మాధవనగర్ నుంచి జిల్లా కేంద్రంలోని కవిత స్వగృహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సూదం రవిచందర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ గౌడ్, ఎస్ఏ అలీం తదితరులు పాల్గొన్నారు.







## ట్రావెల్స్ బస్సుల తనిఖీ

**అక్షరటుడే ఇందల్వాయి:** కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రావెల్స్ బస్సుకు నిప్పంటుకుని 20 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద శనివారం ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు, ఫిట్‌నెస్ ఉండాలని అధికారులు సూచించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్డుపైకి వస్తే కఠినచర్యలు తప్పవని వారు హెచ్చరించారు. వాహనాల తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పవన్ కళ్యాణ్, శృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం



**అక్షరటుడే, బోధన్:** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ తోడ్పాటుతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను స్ఫూర్తిగా తీసుకుని మరికొంత మంది ఇళ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయిస్తున్నామని, ఐకేపీ, మెప్మా ద్వారా విరివిరిగా రుణాలు మంజూరు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ తోడ్పాటును అందిపుచ్చుకుని తన నియోజకవర్గంలోని జైతాపూర్ గ్రామంలో పది మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసుకున్నారని, మరో 60 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, ఎంపీడీవో శంకర్ నాయక్, తహశీల్దార్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల సైకిల్ ర్యాలీ..

– మరిన్ని చిత్రాలు 2లో..

పోలీస్ అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా పోలీసులు శనివారం బైక్, సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో సీపీ సాయిచైతన్య, కామారెడ్డిలో ఎస్పీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల నిర్వహించారు. – అక్షర టుడే, నెట్‌వర్క్

## గోరక్షకుడిపై కాల్పులు జరిపిన వారిని అరెస్టు చేయాలి

**అక్షరటుడే, ఇందూరు :** హైదరాబాద్ శివారులో గోవుల అక్రమ తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేసిన గోరక్షకుడు సోను సింగ్‌పై కాల్పులు జరిపిన ఇబ్రహీంను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. కాల్పుల ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడానికి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గో సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.





## ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్లాస్టిక్ వాడకంతో జరుగుతున్న అనర్థాలను వివరించేందుకు 'స్వచ్ఛ యాత్ర' కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఎల్లారెడ్డిలో శనివారం స్వచ్ఛయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బస్టాండ్ ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చికెన్ సెంటర్ల నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్లాస్టిక్ వాడకం నిలిపివేసిన వ్యాపారులను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. ఎల్లారెడ్డి బస్టాండ్‌లో పరిసరాల శుభ్రత, శానిటేషన్ కార్యకలాపాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బస్టాండ్‌లోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. బస్సుల్లో ప్రయాణికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న అనర్థాలను వారికి వివరించారు. ఎల్లారెడ్డిని ఉత్తమ మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోటగల్లి గర్ల్స్ హైస్కూల్‌లో దుర్వాసన..

**సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలతో ఇబ్బంది**

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని కోటగల్లి బాలికల ఉన్నత పాఠశాలలో దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌ను శుక్రవారం సాయంత్రం శుభ్రం చేయించారు. అయితే అందులోని వ్యర్థాలను పాఠశాల వెనకాలే పారబోశారు. దీంతో విపరీతమైన దుర్గంధం వస్తోందని విద్యార్థినులు వాపోయారు. వాసనతో ఉండలేకపోతున్నామని, శనివారం ఉదయం నుంచి వర్షం పడడంతో దుర్వాసన మరింత ఎక్కువైందని పేర్కొన్నారు. పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు అవగాహన కల్పించే వారే ఇలా చేయడం శోచనీయం. ఇప్పటికైనా శుభ్రం చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.




## దేగాం పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ

**అక్షరటుడే, మాక్లూర్:** ఆలూరు మండలంలోని దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త, సమాజ సేవకులు చిట్టాపూర్ వాసి ఏనుగు దయానంద్‌రెడ్డి డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ మేరకు శనివారం 25 డెస్క్ బెంచీలను ఆయన స్కూల్ హెచ్‌ఎం బున్ని రాజేందర్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి డెస్క్ బెంచీలు అందజేసిన దయానంద్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీడీ రాజేందర్, చిట్టాపూర్‌వాసి గణేశ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని రేణుక ఎల్లమ్మ జమదగ్ని–చింతల పొచ్చమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవ రోజైన శనివారం గణపతి హోమం, శాంతి హోమం, నిత్యపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రశాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బాలకిషన్ గౌడ్, కిరణ్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, సాయిరాం గౌడ్, కిషన్ గౌడ్, సతీష్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలి

**అక్షరటుడే, బాల్కొండ:** డ్రగ్స్‌కు బానిసలుగా మారి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని బాల్కొండ సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌ను ఆయన తన కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి ప్రాణాలను పణంగా పెడుతున్నారన్నారు. వాటి మాయలో పడి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటికి బదులుగా క్రీడలపై మనసు పెట్టి ఆడితే మత్తు పదార్థాలకు దూరంగా ఉండవచ్చన్నారు. క్రీడలతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌కు వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడకు చెందిన కచ్చకాయల శ్రీనివాస్ శ్రవణ్ దర్శకత్వం వహించగా.. రాజు, బాలు, సంజయ్, వినయ్ నటించారు.



## డివైడర్‌ను ఢీకొని కంటైనర్ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) వద్ద ఓ కంటైనర్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి పార్సిళ్లతో నిజామాబాద్‌కు వస్తున్న కంటైనర్ శనివారం వేకువ జామున 5 గంటల సమయంలో బోల్తా పడింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ సమయంలో వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.



## అకాల వర్షం..

# రైతన్నకు నష్టం..

▸ వాతావరణ మార్పులతో వానలు ▸ తడుస్తున్న పంటలు ▸ ఆందోళనలో రైతులు

**వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పంట కోతల సమయం కావడంతో ఆరబెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పంట దెబ్బతింటుండడంతో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.** – అక్షరటుడే, బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, కోటగిరి, పోతంగల్ మండలాల్లో వర్షం పడుతుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరబెట్టిన ధాన్యం తడిసి, మళ్లీ తేమ పీల్చుకుంటోంది. ఫలితంగా ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తడిగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. వారం రోజుల క్రితం పంట కోసినా.. ఇప్పటికీ ధాన్యం ఆరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. తేమ శాతం నిబంధన లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ధాన్యం ఆరడం లేదు..



ధాన్యం కోసి ఆరు ఐదు రోజులు గడుస్తోంది. ప్రతి రోజు ఎండబెడుతున్నాను. ఎండ సరిగా రాకపోగా.. ప్రతి రోజు వర్షాలు పడుతున్నాయి. కౌలుకు తీసుకున్న 2 ఎకరాల పంట ఎండబెట్టలేని పరిస్థితి ఉంది. మరో ఒకటిన్నర ఎకరం పంట కోయాల్సి ఉంది.

– వెంకట్, దామరంచ, బీర్కూర్ మండలం

### వర్షంతో ఇబ్బంది..



మూడు ఎకరాల పంట కోసి వారం రోజులు అవుతుంది. అయినా ఇప్పటివరకు ఎండలేదు. రోజూ వర్షం పడుతుండడంతో ధాన్యం తడిసిపోతోంది. ధాన్యం ఆరబెడదామంటే ఇబ్బంది అవుతోంది.

– కాశీరాం, నాగారం, బాన్సువాడ మండలం

## ఆలూర్‌లో ఉపాధిహామీ పథకంపై సమీక్ష



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉపాధిహామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో శివకృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో పన్నుల వసూలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో రాజలింగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## కుక్కకాటుతో మరణించిన విద్యార్థినికి సంతాపం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలకేంద్రానికి చెందిన గడ్డం లక్షిత (10) అనే విద్యార్థిని ఇటీవల పెంపుడు కుక్క దాడిలో తీవ్రంగా గాయపడగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ విద్యార్థిని మండలకేంద్రంలోని కృష్ణవేణి ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది. బాలిక మృతికి సంతాపంగా శనివారం పాఠశాలలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పెంపుడు జంతువులు, వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని పాఠశాల డైరెక్టర్ విఘ్నేష్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల పర్యవేక్షకుడు బి రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హనుమాన్ గుట్టలో కార్తీకమాస వేడుకలు



**అక్షరటుడే, బాల్కొండ:** కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా మండలకేంద్రంలోని వీర హనుమాన్ గుట్టలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని, ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లేడు మాలతో అలంకరించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. హనుమాన్ చాలీసా పారాయణంతో భక్తుల కష్టాలు తొలగి, సుభిక్షంగా ఉంటారన్నారు. ప్రతి హిందువు నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం చేయడం ఎంతో మంచిదన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఎదుట శనివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ. 8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. దీంతో పేద మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే భవిష్యత్తులో ఏబీవీపీ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్, సన్నీ, సిద్ధు, విగ్నేష్, టోనీ, కార్తీక్, విగ్నేష్, హరీష్, శశాంక్, రంజిత్, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై స్ప్రే పంపుల పంపిణీ




**అక్షరటుడే, వర్ని:** వర్ని మండలం జాకోరలో రైతులకు 75 శాతం సబ్సిడీపై స్ప్రే పంపులు పంపిణీ చేశారు. వర్ని ఏఎంసీ ఛైర్మన్ సురేష్ బాబా పాల్గొని రైతులకు స్ప్రే పంపులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాకోర సొసైటీ ఛైర్మన్ దశరథ్, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ గౌడ్, అబ్దుల్ బారి, శనిగరం కిషన్, బాలయ్య, కూనిపూర్ మాజీ సర్పంచ్ కాంతారావు పాల్గొన్నారు.

## ఖానాపూర్ జీపీలో ఉచిత దంత వైద్య శిబిరం



**అక్షరటుడే, నిజామాబాద్ రూరల్ :** ఖానాపూర్ పంచాయతీలో శనివారం శీను నాయక్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ సిబ్బందికి పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను అందజేశారు. అనంతరం దంత సంరక్షణ గురించి వారికి అవగాహన కల్పించారు. సుమారు 200 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి సిబ్బంది, జీపీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరాక్‌లో ఆలూరు వాసి మృతి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కుర్మే చిన్న రాజేష్ (45) ఇరాక్‌లో కూలిపని చేస్తూ జారిపడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా మారడంతో జీవనోపాధి కోసం కొన్నేళ్ల క్రితం ఇరాక్‌కు వెళ్లిన రాజేష్ అక్కడ కూలీగా పనిచేస్తున్నారు. అయితే గురువారం కూలిపనుల్లో భాగంగా భవనంపైకి వెళ్లిన ఆయన జారి కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించే విధంగా కృషి చేయాలని ఆలూర్ కల్లెం భోజరెడ్డి, స్థానిక నాయకులు ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి కోరారు. వెంటనే స్పందించిన వారు సంయుక్తంగా ఇరాక్ ప్రభుత్వానికి వినతిపత్రం పంపించారు.

## నగరంలో యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నగరంలోని వినాయక్ రిలయన్స్ మాల్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. నాల్గో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అకాశ్ అనే యువకుడు రిలయన్స్ మాల్‌లో పనిచేస్తూ మాల్ పక్కనే ఉన్న గల్లీలో తన స్నేహితులతో నివాసముంటున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ వ్యవహారమే కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రాజంపేట మండలం పొందుర్తి బైపాస్ రహదారిపై సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, పోలీసులు



ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద..

## అమరవీరులకు నివాళిగా సైకిల్ ర్యాలీలు



నందిపేట్ మండల కేంద్రంలో..



ముప్కాల్ మండలంలో..